


చిగురిస్తున్న ఆశలు

- ఓరుగల్లు సభలో సీఎం రేవంత్‌రెడ్డి నోట కొత్తగూడెం ఎయిర్‌పోర్టు మాట
- తప్పకుండా ఏర్పాటు చేస్తామని ప్రకటన



కొత్తగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో తప్పనిసరిగా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వరంగల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగసభలో సీఎం మాట్లాడుతూ వరంగల్‌తో పాటు కొత్తగూడెంలోనూ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. దీంతో మళ్లీ కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మూర్తి నాయుడికి ప్రతిపాదనలు కూడా చేశారు. దీంతో పాటుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన వెయ్యి ఎకరాల ప్రభుత్వ స్థలం కూడా పరిశీలన చేసినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అవసరమైతే కేంద్ర విమానయానశాఖమంత్రి రామ్మూర్తినాయుడిని కలుసుకుని కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు ఎమ్మెల్యే ఇటీవల తెలిపారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేస్తామని వరంగల్ సభలో ప్రకటించడంతో కొత్తగూడెం ఎయిర్‌పోర్టు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

ఏజెన్సీలో గిరిజనేతరుల సమస్యలు

ప్రభుత్వం దృష్టికి..

- విన్నపాలన్నీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక
- బీసీల్లోని నిరుపేద కులాలకు న్యాయం జరిగేలా కృషిచేస్తాం
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

ఖమ్మం, నవంబరు 19(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తమ కమిషన్ కృషిచేస్తుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. జిల్లాలోని బీసీ వర్గాలనుంచి వచ్చిన వినతులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌తోపాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం బీసీవర్గాల నుంచి 79 పైగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల తమతమ కులాల స్థితిగతులను తెలియచేశారు. ఈ సందర్భంగా కమిషన్ బీసీ సామాజిక, విద్య స్థితిగతులపై బహిరంగవిచారణ నిర్వహించింది. ఈ విచారణకు హాజరైన బీసీసంఘాల నాయకులు సమస్యలు చెప్పుకోవడంతో పాటు పలు సూచనలు తెలిపారు. వినతిపత్రాలు కూడా అందించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల్లో పెద్దకులాలే లబ్ధిపొందుతున్నాయని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బీసీల్లోని చిన్న కులాలు తమ ఆవేదనను కమిషన్ ముందు వ్యక్తపరిచాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కుటుంబ సర్వేలో ఎవరైనా తప్పుడు సమాచారం అందించినా, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు ఎక్కడైనా సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బీసీవర్గాల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనంపై ఖమ్మం కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి బీసీ, విద్యార్థి, యువజన, మహిళ సంఘాలు తమ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై కమిషన్‌కు రాతపూర్వకంగా, మౌఖికంగా వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బీసీ కమిషన్ ఉమ్మడి జిల్లానుంచి 79మంది నుంచి వినతిపత్రాలు స్వీకరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాలతో పాటు ఇతరవర్గాల సమాచారాన్ని స్థితిగతులు తెలుసుకునేందుకు ఇంటింటి సర్వేను ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ సర్వే ద్వారా బీసీ కులాల్లోని పేద, నిరుపేదవర్గాలు, కులాలను సంచార జాతులను కూడా గుర్తించడం, వారి జనాభా నిష్పత్తి ఆధారంగా వారికి ప్రభుత్వపరంగా స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమపథకాల్లో అవకాశాలు కలిపించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఇంటింటి సర్వే విజయవంతంగా సాగుతోందని, ఇప్పటికే 75,75,647 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. 65శాతం సర్వే పూర్తయిందన్నారు. తమ కమిషన్ ఇప్పటికే ఏడు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించిందని, ఆయా జిల్లాల్లో బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పరిస్థితులను స్వచ్ఛందంగా తెలియచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏజెన్సీ ఏరియాలో నివసిస్తున్న బీసీలతో పాటు ఇతర గిరిజనేతరులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి పథకాలు అందడంలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే బీసీల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన కులాలే అనేక అవకాశలు పొందుతున్నారని, నిరుపేదవర్గాలు, కులాలకు అవకాశాలు దక్కడంలేదని పలువురు కమిషన్ దృష్టికి తెచ్చారని తెలిపారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్, విదేశీవిద్యాపథకం సక్రమంగా అమలు చేయడంలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు కూడా బీసీ రిజర్వేషన్ల అమలుపై బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రెండు జిల్లాల్లో ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు ప్రజలకు దేవుళ్ల కంటే ఎక్కువ.. ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వారి వద్దకే పరుగులు తీస్తారు. వారు రాసిచ్చిన మందులపై అపార నమ్మకంతో కడుపులో వేసుకుంటారు. కానీ ఇదే అదునుగా కొందరు గ్రామీణ వైద్యులు ఇష్టారీతిన తెలిసీ తెలియని వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎలాంటి అనుభవం, పరిజ్ఞానం లేకపోయినా ఎంబీబీఎస్ స్థాయిలో వైద్యం చేస్తూ డబ్బు సంపాదిస్తున్నారు. వారినే నమ్మిన వారికి రోగం ముదిరే వరకు పెద్దాసుపత్రులకు వెళ్లమని చెప్పకుండా విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లు కల్లోలం సృష్టిస్తున్నాయి. అవసరానికి మించి చేస్తున్న వైద్యం ప్రజల ప్రాణాల మీదకు తెచ్చిపెడుతున్నాయి. ఇటీవల కాలంలో జిల్లాలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన తనిఖీల్లో పలు వాస్తవాలు బహిర్గతమయ్యాయి.




కిల్లర్ క్లినిక్స్!

- జిల్లాలో పుట్టగొడుగుల్లా ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు
- అర్హత లేకున్నా ఇష్టారాజ్యంగా వైద్యం చేస్తున్న కొందరు ఆర్‌ఎంపీలు
- ఉచితంగా వచ్చే శాంపిల్ మందులిచ్చి డబ్బు వసూలు
- మెడికల్ కౌన్సిల్ తనిఖీలతో వాస్తవాలు బహిర్గతం

ఖమ్మం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొందరు ఆర్‌ఎంపీలు జిల్లా కేంద్రం, పట్టణం, గ్రామం అన్న తేడా లేకుండా క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో ఏకంగా ఆసుపత్రులనే నిర్వహిస్తున్నారు. వారిలో అత్యధికంగా కొద్దిరోజులపాటు ఆసుపత్రుల్లోనో లేదా, తమ గ్రామానికి దగ్గరగా ఉన్న ప్రధాన పట్టణాల్లోని పెద్ద ఆసుపత్రుల్లోనో కాంపౌడర్‌గా పనిచేయడం, కొంతమేర వైద్య పరిజ్ఞానం సంపాదించి సొంత ఊరిలో ఆర్‌ఎంపీలుగా అవతారం ఎత్తడం పరిపాటిగా మారింది. సూది వేయడం వస్తే చాలు వైద్యం మొత్తం తెలిసినట్లే ముందడుగు వేస్తున్నారు. కాంపౌండర్‌గా పనిచేసిన సమయంలో తెలిసిన కాస్తోకూస్తో పరిజ్ఞానంతో గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లు పెట్టేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులున్నా వారు ప్రైవేటుకు ఎక్కువ ప్రాధాన్యమివ్వడం, సమయం పాటించకపోవడం, వచ్చిన రోగులను సరిగ్గా పట్టించుకోవడంలేదన్న విమర్శలతో రోగులు స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలు, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు గ్రామీణ వైద్యులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. తమకు తెలిసీ తెలియని వైద్యం నిర్వహించి ప్రజల నెత్తిన రోగాల కుంపటి పెట్టేస్తున్నారు. ఆ తర్వాత పెద్దాసుపత్రులకు తరలించి ఆసుపత్రి నుంచి బయటకు వచ్చే వరకు అంతా తామై నడిపిస్తున్నారు. అలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు వందల సంఖ్యలో ఉన్నాయి. కాగా అసలు జిల్లాలో ఎంతమంది ఆర్‌ఎంపీలుగా వ్యవహరిస్తున్నారు. వారిలో ఎంతమందికి పట్టా పరిజ్ఞానం ఉందన్న అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టిసారించిన దాఖాలాలు లేవు. ఎక్కడో ఒకచోట సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందించి కేసులు నమోదు చేయించడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో 41మందిపై కేసు నమోదు చేయడమే ఈ ఆరోపణలకు నిదర్శనంగా నిలుస్తోంది.

పల్లెల్లో బెదిరింపుల పర్వం

కొందరు ఆర్‌ఎంపీలు వ్యవహారం పల్లెల్లో బెదిరింపుల స్థాయికి చేరింది. ఎవరైనా రోగి తమ వద్ద చూపించుకోవాలని వచ్చిన అనంతరం వారు చెప్పిన ఆసుపత్రికి వెళ్లకుంటే ఇక అంతే సంగతులు. ఆ తర్వాత సదరు రోగికి ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితులు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్నాయి. ఇంజక్షన్ ఇచ్చేందుకు కూడా సదరు ఆర్‌ఎంపీలు రావడం లేదని పలువురు గ్రామీణ ప్రాంతాల రోగులు వాపోతున్నారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ ఖర్చయినా వారు చెప్పిన ఆసుపత్రులకే వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేనా జిల్లా కేంద్రాల్లో తెలిసిన కొందరు మెడికల్ రిప్రజెంటేటీవ్స్ వద్ద శాంపిల్ మందులను తీసుకెళ్లి వాటిని ప్రజలపై ప్రయోగిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఉచితంగా ఇచ్చే శాంపిల్ మందులను గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌ఎంపీలు నిర్వహించే క్లినిక్‌లు, ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లెక్క తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.



అర్హతలేని వైద్యులు..

అడ్డగోలు దందా...

- జిల్లాలో మెడికల్ కౌన్సిల్ ఆకస్మిక తనిఖీ
- 41మంది క్లినిక్ నిర్వాహకులపై కేసు నమోదు

ఖమ్మం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కేవలం ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు నిర్వహించాల్సిన వారు క్లినిక్‌ల పేరిట దర్జాగా దందా నిర్వహిస్తున్నారు. పెద్ద డాక్టర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఎంబీబీఎస్ అర్హత లేని వ్యక్తులతో క్లినిక్‌ల పేరిట ఏకంగా ఆసుపత్రులే నిర్వహిస్తున్నారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనలు పాటించకుండా ఇంజక్షన్లు, ఫ్లూయిడ్స్ ఇవ్వడం వంటి అన్నీ రకాల వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్‌ల నిర్వాహణ లోపాలు బహిర్గతం అయ్యాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి (మిగతా 6వ పేజీలో)

రేపు, ఎల్లుండి జిల్లాలో మాజీమంత్రి

హరీష్‌రావు పర్యటన

- లగచర్ల బాధితులకు సంఘీభావంగా నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటిస్తారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కోరారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, మండల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లగచర్ల బాధితులకు సంఘీభావంగా గురువారం సాయంత్రం 6గంటలకు నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌నుంచి జెడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీలో హరీష్‌రావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, గిరిజన బిడ్డలు భారీగా హాజరుకావాలని కోరారు. శుక్రవారం ఉదయం ఖమ్మం వ్యవసాయమార్కెట్‌ను హరీష్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల బృందం సందర్శిస్తారని, పత్తి, మిర్చి, ధాన్యం కొనుగోలుపై రైతులతో మాట్లాడతారని తాతా మధుసూదన్ పేర్కొన్నారు. అనంతరం చింతకాని మండలం ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో హరీష్‌రావు పర్యటించి, ఇటీవల చనిపోయిన ఇద్దరు రైతు కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. అక్రమ కేసులు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

సభ్యత్వ నమోదులో

సైకిల్ జోరు

- ముమ్మరంగా సాగుతున్న కార్యక్రమం
- తెలంగాణలో ఖమ్మం జిల్లా ప్రథమం


ఖమ్మంలో సభ్యత్వ నమోదు దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు ముమ్మరంగా కొనసాగుతోంది. రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా సభ్యత్వాల నమోదులో ప్రథమ స్థానంలో నిలిచిందని పార్టీ నాయకుడు కేతినేని హరీష్ తెలిపారు. ఖమ్మంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పలువురికి సభ్యత్వాలను ఇచ్చారు. ఈ సందర్భంగా కేతినేని హరీష్ మాట్లాడుతూ గుడ్ల వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, క్యాన్సర్ వల్ల ఒక కాలు తీసివేసినా వికలాంగుడిగా పార్టీకి సేవ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రరవి కుమార్, కర్నాటి సీతారాములు, చింతనిపు నాగేశ్వరరావు, బోడేపుడి రవి, అనంత కుమార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



- దర్తీ అబజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ పథకానికి కేంద్రం శ్రీకారం
- గిరిజన గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యం
- భద్రాద్రి జిల్లాలో 19మండలాలు, 130 గ్రామాల ఎంపిక
- ఆరు అంశాల్లో 55 సూచికల అమలుకు కసరత్తు

గుండాల మండల కేంద్రం

గిరి బిడ్డలకు ఆసరాగా..

భద్రాచలం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలవుతున్నా నేటికీ గిరిజనులకు పూర్తిస్థాయిలో మౌళిక సదుపాయాలు అందడం లేదు. రూ.కోట్లు వెచ్చించినా ఆశించిన మేర గిరిజన ప్రాంతాల అభివృద్ధి జరగలేదని గణాంకాలే చెబుతున్నాయి. దీంతో ఐక్యరాజ్య సమితిలో మానవ అభివృద్ధి సూచిక పురోగతి ఆశించినస్థాయిలో లేదని చెప్పక తప్పదు. ఈ క్రమంలో మానవ అభివృద్ధి సూచిక పురోగతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం "దర్తీ అబజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్" పథకానికి 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో శ్రీకారం చుట్టింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద 10.45 కోట్ల మంది గిరిజనులు ఉండగా అందులో 705 గిరిజన ఉపకులాలు ఉన్నాయి.

దేశంలోని 549 జిల్లాల్లో 2,911 మండలాలలోని 63,643 గామాలలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఆకాంక్ష మండలంలో 50 మంది లేదా అంతకంటే ఎక్కువ జనాభ ఉన్న గిరిజన మండలాలు, గ్రామంలో కనీసం 50 శాతం గిరిజన జనాభ ఉన్న గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా అందులో 19 మండలాల్లో 130 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో 2024-25 నుంచి 2028-29 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ సమయంలో ఆరు అంశాలతో 55 సూచికలను అమలు చేయటం ద్వారా ఐక్యరాజ్యసమితిలో మానవ అభివృద్ధి సూచిక పెరుగుదలకు ఇది ఎంతగానో దోహదపడుతుందని (మిగతా 6వ పేజీలో)



దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలో జాతీయ స్థాయి క్రికెట్ పోటీల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు, శ్రీరామనవమికి ఎంతటి ప్రాధాన్యముందో అదే రీతిలో నేషనల్ టోర్నీకి కూడా అంతే ప్రాధాన్యముంది. ఇప్పటి వరకు భద్రాద్రిలో 20సార్లు జాతీయస్థాయి భద్రాద్రికప్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈసారి సైతం పోటీలను నిర్వహించాలనే యోచనలో నిర్వాహకులు, క్రికెటర్లు, దాతలు ఉన్నారు. ఇప్పటికే జాతీయస్థాయిలో భద్రాద్రికప్ క్రికెట్ పోటీలను నిర్వహించేందుకు ప్రాథమికంగా కసరత్తు నిర్వహించినట్లు సీనియర్ క్రికెటర్లు పేర్కొంటున్నారు.

క్రికెట్ ప్రియులకు పండుగ...



త్వరలో భద్రాద్రి కప్..

- మరోసారి భద్రాచలంలో జాతీయస్థాయి క్రికెట్ పోటీలు
- జనవరిలో టోర్నమెంట్‌కు కసరత్తు
- ఇప్పటి వరకు 20 సార్లు నిర్వహణ
- గతంలో పాల్గొన్న అంతర్జాతీయ, జాతీయ క్రికెటర్లు

భద్రాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నీ అనుకూలిస్తే ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో మరోసారి భద్రాద్రికప్ జాతీయస్థాయిక్రికెట్ పోటీల సందడి నెలకొననుంది. ఈ పోటీలను జనవరి ఆరంభంలో నిర్వహించాలనే యోచనలో నిర్వాహకులుండగా దేశంలోని అత్యంత ప్రముఖ జట్లను ఈ పోటీలకు ఆహ్వానించనున్నట్లు సీనియర్ క్రికెటర్లు పేర్కొంటున్నారు. కాగా పోటీల్లో విజేతలు, రన్నర్స్‌కు ట్రోఫీలతో పాటునగదును, సెమీఫైనల్‌లో ఓటమి చెందిన రెండు జట్లకు ప్రోత్సాహక నగదును ఈసారి భారీగానే ఇచ్చే అవకాశాలున్నటున్న సమాచారం. అలాగే పోటీల్లో వ్యక్తిగత ప్రతిభ చూపిన క్రికెటర్లకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంటును సైతం ఇవ్వనున్నారు.

1991లో భద్రాద్రికప్ ప్రారంభం

1991లో ప్రారంభమైన భద్రాద్రి కప్ టోర్నమెంటు నిర్విరామంగా రెండు దశాబ్దాలపాటు నిర్వహించారు. అనంతరం గత దశాబ్ద కాలంగా ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నమెంటు నిలిచిపోయింది. ఈ క్రమంలో 20వ సారి భద్రాద్రికప్ పోటీలను 2022 ఫిబ్రవరి 18 నుంచి మార్చి 3 వరకు పోటీలను నిర్వహించారు. మళ్లీ 2025 జనవరిలో పోటీలను నిర్వహించాలని నిర్వాహకులు, సీనియర్ క్రికెటర్లు భావిస్తున్నారు. గతంలో ఈ పోటీల నిర్వహణకు సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ, ప్రవాస భారతీయులతో పాటు భద్రాద్రికి చెందిన పుర ప్రముఖులు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. ఇదే కోవలో ఈసారి సైతం పోటీల నిర్వహణకు దాతల సహకారాన్ని నిర్వాహకులు కోరుతున్నారు.

హెచ్‌సీఏ అంపైర్లు..

గతంలో రెండు దశాబ్దాలుగా నిర్వహించిన భద్రాద్రి కప్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే తలమానికంగా నిలిచింది. ఈ పోటీలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ప్యానెల్ అంపైర్లతో నిర్వహించే వారు. ఉచిత, భోజన వసతి సదుపాయాలను అందించే వారు. 2022లో నిర్వహించిన భద్రాద్రి కప్ జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా సిరి ఆసుపత్రి ఒంగోలు జట్టు నిలిచింది. రన్నర్స్‌గా హైదరాబాద్ బీబీమేవరిక్స్ నిలిచింది. విజేతలకు రూ.లక్ష నగదుతో పాటు రోలింగ్ ట్రోఫీ, రన్నర్స్‌కు రూ.70 వేలతో రన్నర్స్ ట్రోఫీని అందజేశారు.

గొప్ప ఆటగాళ్లు ఆడిందిక్కడే...

నలుగురు టెస్టు క్రికెటరుతో పాటు ండర్-19 భారత జట్టుకు, సౌత్‌జోన్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన అనేక మంది క్రికెటర్లు భద్రాచలంలో ఆడారు. గతంలో భారత జట్టుకు వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎంఎస్‌కే ప్రసాద్, భారత జట్టు ఓపెనింగ్ బౌలర్‌గా బాధ్యతలు నిర్వహించిన కర్నాటకకు చెందిన డేవిడ్ జాన్సన్, స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా, ప్రస్తుత మిడల్ ఆర్డర్ బ్యాట్‌మెన్ హనుమా విహారి ఇక్కడ భద్రాద్రి కప్‌లో ప్రాతినిధ్యం వహించారు.

అండర్-19 భారత జట్టులో ఆడిన సంతోష్ యాదవ్ భద్రాద్రి కప్‌లో ఆడారు. రెస్టాఫ్ ఇండియా జట్టుకు గతంలో ప్రాతినిధ్యం వహించిన తమిళనాడు క్రికెటర్లు కరుణమూర్తి, శివసుందర్‌దాస్, సౌత్ జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అనూప్‌పాయి, అహ్మద్ ఖాద్రి, అర్జున్ యాదవ్ లాంటి క్రికెటర్లు పరుగుల వరద పారించారు. భారత జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా సుదీర్ఘకాలం పని చేసిన రంజీ క్రికెటర్ శ్రీధర్ కూడా ఇక్కడ ఆడటం విశేషం. భద్రాద్రి కప్‌లో గత రెండు దశాబ్దాలుగా 30 మందికి పైగా రంజీ క్రికెటర్లు ఆడారు. సౌత్ జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయసారధి, మధుసూదన్‌రాజుతో పాటు హైదరాబాద్ రంజీ జట్టుకు చెందిన ఆర్.శ్రీధర్, చేతన్ ఆనంద్, జీఎస్ శ్రీనివాస్, విష్ణువర్ధన్, నరేంద్ర పాల్ సింగ్, ఆంధ్రా రంజీకి చెందిన మల్లికార్జున్, కేఎస్‌టీ సాయి, రామకృష్ణ, ప్రసాద్, సురేష్, పాతిమారెడ్డి తదితరులు ప్రాతినిధ్యం వహించారు.


2022 విజేత ఒంగోలు జట్టు


విద్యార్థులు రూపొందించిన పిచికారి పరికరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


గ్రాండ్ క్యాంప్ ఫైర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికవ్వాలి

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శస్తున్న ఇన్‌స్పెయిర్ ప్రాజెక్టులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. రెండో రోజు మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా ఇన్‌స్పైర్ మనక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనకు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కన్నా మెరుగైన ప్రాజెక్టులను విద్యార్థులు ఇక్కడికి తీసుకువచ్చారని, ప్రాజెక్టుల రూపొందించటంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారని, ఈ ప్రాజెక్టులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక అవుతాయనే ఆశాభావం ఎమ్మెల్యే వ్యక్తం చేశారు.

ఎనిమిది ప్రాజెక్టులను ఎంపిక చేస్తాం: డీఈవో

జిల్లా స్థాయిలో జరుగుత్ను ఈ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన ఎనిమిది ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి తెలిపారు. అక్కడి పరిశీలన అనంతరం జాతీయ స్థాయికి ఎంపిక అవుతాయన్నారు.

అక్కడికి ఎంపిక అయిన ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు రూ.1 లక్షను కేంద్రం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు సుకృత్, న్యాయ నిర్ణేతలు మాధవి, జగన్మోహనరాజు, ప్రిన్సిపాల్ బురాన్, ఎంఈవో ఆనందకుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పర్సా వెంకటేశ్వరరావు, వనమా గాంధీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైంటిస్టులుగా ఎదగాలి

సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలను వినియోగించుకొని విద్యార్థులు సైంటిస్టులుగా ఎదగాలని ఐటీడీవో పీవో రాహుల్ విద్యార్థుకు సూచించారు. అన్నపురెడ్డిపల్లిలో జరుగుతున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను పీవో సందర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పీవో గ్రాండ్ క్యాంఫైర్‌ను ప్రారంభించి, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. దీంతో పాటు మండల పరిధిలోని ఎర్రగుంట పాఠశాల విద్యార్థులు నిర్వహించిన స్కౌట్ ప్రదర్శన అక్కడకు హాజరైయిన వేలాది మందిని ఆకట్టుకుంది..

బాలుడు కాదు.. బాహుబలి

- ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మనిచ్చిన తల్లి


పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లితో కాన్పు చేసిన వైద్య బృందం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం ఓ బాహుబలి శిశువుకు ఓ తల్లి జన్మనిచ్చింది. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం నిడిగొండ సుజాత చింతలపూడి మండలం వెంకటాద్రిగూడేనికి చెందిన గర్భిణి మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి కాన్పుకోసం వచ్చింది. మహిళకు మూడో కాన్పు కావడంతో అక్కడి వైద్యులు ఆ మహిళను పరీక్షించి ఖమ్మం జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో ఖమ్మం ఆస్పత్రి గైనకాలజిస్టు హెచ్‌వోడీ డాక్టర్ యామినీ ఆధ్వర్యంలో డాక్టర్ ఇందు, జ్యోత్స్న సాధారణ కాన్పు చేశారు. ఆ మహిళకు 4.1కిలోల బరువుతో మగబిడ్డకు జన్మనిచ్చింది. కాన్పును సునాయాసంగా వైద్యులు చేయడంతో బాహుబలి శిశువుకు జన్మనిచ్చింది. వైద్య బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు ప్రశంసించారు.

కుటుంబ సర్వేను పరిశీలించిన బీసీ కమిషన్

కూసుమంచి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబసర్వేను బీసీ కమిషన్ పరిశీలించింది. ఈసందర్భంగా జిల్లా పర్యటన ముగించుకుని వెళుతున్న బృందం మంగళవారం రాత్రి కూసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో సర్వే పత్రాలను పరిశీలించారు. కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాష్,సురేందర్, బాలలక్ష్మి, సతీష్ తదితరులు ఉన్నారు. ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీవో రామచంద్రరావు, ఎన్యుమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత శాతం సర్వే పూర్తయింది, అన్ని ఆస్తుల, వ్యసాయభూముల, వాహనాల, కుల, ఇతరత్రా వివరాలు చెపుతున్నారా, వ్యతిరేకత వస్తుందా, ఇంకా ఎన్ని రోజుల్లో సర్వే పూర్తవుతుంది, ఎన్నిరోజుల్లో ఆన్‌లైన్ చేస్తారు, అంటూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.


వివరాలు తెలుసుకుంటున్న బీసీ కమిషన్ బృందం

అర్హతలేని వైద్యులు.. అడ్డగోలు దందా

(5వ పేజీ తరువాయి)

మామిడాల రాము ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్న వాటిపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం ఖమ్మం సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) పోలీసులు 41 మందిపై 419, 420, రెడ్‌విత్ 34 ఐపీసీ, 22 టీఎంపీఆర్, 34, రెడ్‌విత్ 54 ఎన్ఎంసీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ దందాపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోగా.. ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మెడికల్ కౌన్సిల్ వారిపై గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కౌన్సిల్ సభ్యులతో దిగారన్న ప్రచారం జరుగుతోంది. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా తనిఖీలు చేస్తారంటూ కౌన్సిల్‌లోని కొంతమంది సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. కాగా జిల్లాలో ఏకకాలంలో 41మందిపై కేసులు నమోదవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

కేసులు నమోదైన క్లినిక్‌లు ఇవే..

ఖమ్మం ట్రంక్‌రోడ్డులోని లక్ష్మీ క్లినిక్, కాల్వొడ్డులోని శ్రీ లక్ష్మీ క్లినిక్, ప్రకాష్ నగర్‌లోని శ్రీ సాయి క్లినిక్, పవన్ క్లినిక్, ఉమా మహేష్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, వెంకటగిరి క్రాస్‌రోడ్డులోని రుద్ర క్లినిక్, పాకబండబజార్‌లోని సలీం ఫస్ట్ ఎయిడ్ సెంటర్, తుమ్మలగడ్డలోని జోయా ఫస్ట్ ఎయిడ్ సెంటర్, మంచుకొండ రోడ్డులోని అంజలి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, అమృత్ హోటల్ ఎదురుగా ఉన్న ఉష ఫస్ట్ ఎయిడ్ సెంటర్, బుర్హాన్‌పురంలోని శ్రీ వెంకటేశ్వర ఫస్ట్ ఎయిడ్‌సెంటర్, ఎన్నెస్పీ రోడ్డులోని అరుణోదయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ఆర్డీవో సమీపంలోని స్వప్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముదిగొండలో శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సాయిరాం క్లినిక్, క్రిష్ణసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కృప ఫస్ట్ ఎయిడ్ సెంటర్, నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, రఘునాథపాలెం మండలంలోని మంచుకొండలో శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, అంజలి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కామేపల్లి మండలంలోని ముచ్చర్లలో ఆయేష క్లినిక్, ప్రజా వైద్యశాల, ఏన్కూరులో గాయత్రి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, తిమ్మారావుపేటలో అక్షిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్, తల్లాడ మండలంలో తల్లాడలోని ఫస్ట్‌ఎయిడ్ సెంటర్, రూపవతి క్లినిక్, మురళీకృష్ణ క్లినిక్, మిట్టపల్లి గ్రామంలోని ఫస్ట్‌ఎయిడ్ సెంటర్, శ్రీ దుర్గా క్లినిక్, వీఎం బంజరలోని మనుశ్రీ క్లినిక్, శ్రీ శ్వేత ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కొత్తగూడెం రోడ్డులోని హోప్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కొణిజర్ల మండలంలోని తనికెళ్లలో రఫి, రవికాంత్, గోపాలరావు, పల్లిపాడులోని సిరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు.

కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్, రవిందర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, పాలేరులోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కూసుమంచిలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, బాబు ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల నిర్వాహకులపై కేసు నమోదైంది.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కూసుమంచి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుపేట బజార్ గ్రామంలో అగ్నిప్రమాదం సంబవించి పూరిల్లు దగ్ధమయింది. గ్రామానికి చెందిన రెడ్డెబోయిన క్రిష్ణయ్యకు చెందిన ఇంట్లో స్టవ్ ద్వారా మంటలు రేగాయి. దీంతో పూరింటికి అంటుకోవడంతో పూర్తిగా దగ్ధమయింది. కూసుమంచి ఫైర్ అధికారులు మంటలను ఆర్పివేశారు. సుమారు లక్ష విలువైన నష్టం సంభవించింది. కూసుమంచి ఎస్ఐ శ్రీధరాచారి సంఘటనాస్థలాన్ని సందర్శించి పంచనామ నిర్వహించారు.

గుర్తింపు పొందిన పాఠశాల పేరే ఉపయోగించాలి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు, పాఠశాల సీజ్: డీఈవో

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు వారు గుర్తింపు పొందిన పాఠశాలల పేరుకు బదులు వేరే పాఠశాలల పేరుతో బోర్డులు తగిలించి నిబంధనలను అతిక్రమించి నడుపుతున్నట్లుగా జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి వచ్చిందని, ఆ బోర్డులను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో వారి ప్రభుత్వ గుర్తింపును రద్దు చేస్తామని డీఈవో సోమశేఖర శర్మ హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు ఏ పేరుతో ప్రభుత్వ గుర్తింపు పొందాయో ఆ పేరుతోనే స్కూల్ నేమ్ బోర్డ్, బస్సుల మీద పేర్లు, స్కూల్ రికార్డ్స్ మొదలగునవి ఉండాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారికారులు అన్ని గుర్తింపు పొందిన పాఠశాలలు ఆయ పాఠశాలల పేర్లతో మాత్రమే బోర్డులు ఏర్పాటు చేయాలని, స్కూల్ రికార్డ్స్ , బస్సులపై ఆయా పాఠశాలల పేర్లు మాత్రమే ఉండేటట్లుగా చూడాలని డీఈవో ఆదేశించారు.

పై నిబంధనలు పాటించని పాఠశాలలపై నివేదికని ఆధారములతో సమర్పించ వలసినదిగా ఆదేశించారు. మీ మండలాలల్లో ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలాల నడుపుతున్నట్లుఅయితే వాటికి వెంటనే నోటీసులు ఇచ్చి సీజ్ చేయాలని ఆదేశించారు.తల్లిదండ్రులకు ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలో తమ పిల్లలను చేర్పవద్దని సూచించారు.

చకచకా పాత రైతుబజార్ పునఃనిర్మాణ పనులు

ఖమ్మం మార్కెట్ , నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని పెవీలియన్ గ్రౌండ్ వద్ద గల పాత రైతు బజార్ పునరుద్ధరణ పనులు వేగవంతం అయ్యాయి. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో పాత రైతు బజార్‌ను హుటా హుటిన పునఃనిర్మిస్తున్నారు. రఘునాధపాలెం, కారేపల్లి తదితర మండలాల కూరగాయల రైతుల కోరిక మేరకు పాత రైతుబజార్‌ను తిరిగి మనుగడలోకి తీసుకొస్తున్నారు. ఈ రైతు బజార్ కేవలం రైతుల కోసమేనని, సేంద్రీయ, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పండించిన తాజా కూరగాయలను తక్కువ ధరలకు వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు గాను నిర్మిస్తున్నారు. ఈమేరకు రైతుబజార్ నిర్మాణ పనులు ఇప్పటికే సగం వరకు పూర్తయ్యాయి. మరో నెల రోజులలో ఈ రైతుబజార్‌ను నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 100కు పైగా కూరగాయల స్టాళ్లు అందుబాటులో ఉండే అవకాశం ఉందని పలువురు రఘునాదపాలెం రైతులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా రైతు బజార్‌ను తిరిగి పునఃనిర్మాస్తుండటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పాత రైతుబజార్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

గిరి బిడ్డలకు ఆసరాగా..

5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

భద్రాద్రి జిల్లాలో

19 మండలాలు, 130 గ్రామాల ఎంపిక

రాష్ట్రంలో ఆదిలాబాద్, జగిత్యాల, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు దర్తీ అబజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్‌కు ఎంపికయ్యాయి. భద్రాద్రి జిల్లాలో 19 మండలాలు, 130 గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 82,641 ఎస్టీ కుటుంబాలు ఉండగా 3,21,784 మంది ఉన్నారు. ఇందులో 59,853 గిరిజన కుటుంబాలకు చెందిన 2,35,011 మందికి లబ్ధి చేకూరనుంది.

ఏం చేస్తారంటే..

గతంలో గిరిజనుల అభివృద్ధి కోసం గిరిజన ఉప ప్రణాళిక ప్రాంతాన్ని (టిఎస్‌పి) అభివృద్ధి చేసేందుకు 1974-75 నుంచి నిధులు కేటాయించారు. అలాగే షెడ్యూలు ట్రైబ్ కాంపోనెంట్స్, గిరిజన అభివృద్ధి ప్రణాళికలను అమలు చేసినా అనుకున్నంత స్థాయిలో గిరిజనుల అభివృద్ధి జరగలేదని కేంద్రం భావిస్తోంది. ఈ క్రమంలో మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాలను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఉన్న వారికి మరుగుదొడ్లతో సహా పక్కా గృహాలు, రహదారుల అభివృద్ధి, గిరిజన గ్రామాల్లో తాగునీరు, మొబైల్ మెడికల్ యూనిట్స్, గిరిజన విద్యార్థులకు రెసిడెన్షియల్ హాస్టల్స్‌ను అభివృద్ధి చేయనున్నారు. అలాగే ఉన్న పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం, అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించి ఎక్కడైనా అవసరం ఉంటే ఏర్పాటు చేయడం, ఐసీడీఎస్ అందించే ప్రతి సర్వీసు గిరిజన గ్రామాల్లో కిచెన్ గార్డెన్‌లు నిర్వహించనున్నారు. ఏకలవ్య మోడల్ పాఠశాలలు, ఎస్టీ బాలింతలకు పోషకాహారం అందించడం, గిరిజన మహిళలకు ఎల్పీజీ కనెక్షన్‌లు, మొబైల్ టవర్ల ఏర్పాటు, స్కిల్‌డెవలప్‌మెంటు ప్రోగ్రాం, వ్యవసాయం, విద్యుదీకరణ, ఎఫ్ఆర్ఏ పట్టాదారులకు సంప్రదాయ వ్యవసాయంపై పట్టు సాధించేలా చర్యలు తీసుకోవడం వంటి వాటిని ఆరు అంశాలలో 55 సూచికల ద్వారా గుర్తించి అమలు చేయనున్నారు.

అమలు చేస్తే జరిగేది ఇదే...

ఐక్యరాజ్యసమితిలో మానవ అభివృద్ధి సూచికలో భారతదేశం స్థానం మెరుగుపడాలంటే పైన పేర్కొన్న అంశాలలోని సూచికలు అన్నీ అమలు చేయాల్సిఉంది. ఆరోగ్యపరిరక్షణలో భాగంగా మాతా శిశు మరణాల శాతం తగ్గించటం, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, మొబైల్ మెడికల్ యూనిట్ల ఏర్పాట్లు, విద్యాభివృద్ధిలో పెరుగుదల, వృత్తి నైపుణ్యం పెంచేందుకు చర్యలు, పక్కా గృహాలు, విద్యుత్, తాగునీరు, గ్యాస్ కనెక్షన్, రహదారుల ఏర్పాటు చేస్తే ఐక్యరాజ్యసమితి సూచికలో మన స్థానం మెరుగుపడనుంది. అయితే ప్రభుత్వం ఇందుకు సంబంధించి బడ్జెట్‌లో నిధుల ఆమోదం, కేటాయింపు, విడుదలతో గిరిబిడ్డలకు దర్తీ అబజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ ద్వారా న్యాయం జరగనుంది.

బాధిత మహిళలు కుటుంబసభ్యులకు అప్పగింత

పేద కుటుంబాలకు కావడంతో మహబూబ్‌నగర్ తీసుకెళ్లి అప్పగించిన అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొంది వైద్య సేవల అనంతరం వారి వివరాల ప్రకారం మంగళవారం ఇద్దరు మహిళలను వారి కుటుంబ సభ్యులకు అన్నం ఫౌండేషన్ అప్పగించింది. ఇటీవల భద్రాచలంలో ఒక మతిస్థిమితం లేని మహిళ చంటి పాపతో వీధుల్లో దీనస్థితిలో తిరుగుతున్నదని పత్రికల్లో వచ్చిన వార్తకి స్పందించిన భద్రాద్రి కలెక్టర్ సదరు మహిళను చేరదీయవలసిందిగా కొత్తగూడెం డీడబ్ల్యూని ఆదేశించగా కొత్తగూడెం డీడబ్ల్యు విజేత అన్నం ఫౌండేషన్‌ని సంప్రదించి ఆమెని చేరదీయవలసిందిగా సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించిన ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్ భద్రాచలం చేరుకొని సఖి సిబ్బంది భద్రాచలం పోలీసుల సమక్షంలో సదరు మహిళను తన పాపతో సహా భద్రాచలం పోలీసుల స్టేషన్లో పోలీసులు సఖి సిబ్బంది సమక్షంలో అన్నం ఫౌండేషన్ కి అప్పగించినారు. అన్నం ఫౌండేషన్ సదరు మహిళను పాపను భద్రాచలం నుంచి ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కి అన్నం ఫౌండేషన్ అంబులెన్స్ ద్వారా తరలించి వైద్య సేవల అనంతరం వివరాలు అడుగుగా మాది నారాయణపేట్ జిల్లా నర్వ మండలం అని మండల కేంద్రంలో మా అన్నయ్య కట్ట శ్రీనివాసులు మా వదిన ఉన్నారని, తల్లిదండ్రులు ఇద్దరు చనిపోయినారు అని తెలిపిందని అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఇట్టి సమాచారాన్ని ఇంటర్నెట్ ద్వారా తహసిల్దార్‌తో మాట్లాడి అన్నకు సమాచారం అందించారు. మాది పేద కుటుంబం అంత దూరం వచ్చి మా చెల్లిని తీసుకెళ్లడానికి రవాణా ఖర్చులు లేవనగా మీరే తీసుకురండి కోరారు. ఖమ్మంనుంచి అన్నం ఫౌండేషన్ అంబులెన్స్ లో నర్వకి తీసుకెళ్లి నర్వ పోలీస్ స్టేషన్ లో పోలీసుల సమక్షంలో అన్న కట్ట శ్రీనివాసలకి అప్పగించారు. ఈ సందర్భంగా అన్న మాట్లాడుతూ మా చెల్లి ఐదు సంవత్సరాలుగా మానసికంగా బాధపడుతూ వేరు వేరు చోట్ల తిరుగుతున్నది. మా చెల్లిని మాకు అప్పగించినందుకు చాలా సంతోషం అనిపించింది ఈ సందర్భంగా నర్వ పోలీసులు రేణుక అన్న, కుటుంబ సభ్యులు అన్నం ఫౌండేషన్ ని అభినందించినారు.

మరో మహిళ ఖమ్మం రూరల్ పోలీసులు జలగంనగర్‌లో గుర్తు తెలియని మహిళ మతిస్థిమితం కోల్పోయి ప్రజల్ని ఇబ్బంది పెడుతుందని సమాచారం ఇవ్వగా అన్నం ఫౌండేషన్ చేరుకొని పోలీసుల సమక్షంలో ఆ మతి స్థిమితం లేని మహిళని అన్నంఫౌండేషన్ కి తరలించి చికిత్స అందించారు. కోలుకోని వివరాలు తెలిపింది. నా పేరు లడ్డు నాగమణి మాది మహబూబ్‌గర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన వ్యక్తిని తెలపగా ఇంటర్నెట్ ద్వారా మూసాపేట్ ఎస్ఐని సంప్రదించి ఈమె ఫోటో మాట్లాడిన వాయిస్ ని ఎస్ఐకి పంపించారు. భర్తకి , గ్రామస్తులకి సమాచారం ఇవ్వగా చూసి గుర్తుపట్టి ఈమె వేముల గ్రామానికి చెందిన లందు నాగమణి ఈమె ఇంటి నుంచి తప్పిపోయింది ఎన్ని చోట్ల వెతికినా దొరకలేదని సమాచారం ఇచ్చారు.

ఈమెకి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని చెప్పారు కుటుంబం కూడా పేదలై అన్నం ఫౌండేషన్ కి ఖమ్మం చేరుకొని స్తోమతలే కపోవుటవలన ఈ ఇద్దరు మహిళలని పాత మహబూబ్‌నగర్‌జిల్లాగా భావించి అన్నం ఫౌండేషన్ ఇద్దరి మహిళను కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో అప్పగించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు మట్టి ట్రాక్టర్ల సీజ్

జూలూరుపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధృవపత్రాలు లేని ఐదు మట్టి ట్రాక్టర్లను పట్టుకుని మంగళవారం సీజ్ చేసినట్లు కొత్తగూడెం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వి. వెంకటరమణ తెలిపారు. మండలంలోని పంచాయతీల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టేందుకు ఏర్పాటుచేసిన నర్సరీలకు ట్రాక్టర్లలో మట్టితో తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎంవీఐ వాహనాల తనిఖీ చేస్తున్నారు. ట్రాక్టర్లకు సంబంధించిన ధృవపత్రాలు లేకపోవడంతోపాటు డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడపడంతో సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రైం సమాచారం

రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) పరిధిలోని తడికలపూడి స్టేషన్ రెండవ లూప్ లైన్ పక్కన యార్డులో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 - 60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాగ్రస్తుడై ఉండవచ్చని, నోటి నుంచి రక్తం కారి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. భిక్షాటన చేస్తూ మృతి చెందాడని, ఎలాంటి ఆధారాలు లేవని, మృతుడి ఒంటిపై నిలువు, అడ్డం గీతల లుంగీ, తెలు పు ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్ ఉందన్నా రు. నడుముపై మొలతాడు ఉందన్నారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నరసింహాస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని వివరాలు తెలిస్తే 8712658600, 9989025481, 9701371472 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

కూల్‌డ్రింక్ అనుకొని కలుపు మందు తాగిన వృద్ధురాలు

ఏరియా ఆసుపత్రికి తరలింపు

పినపాక, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్ అనుకుని ఓ వృద్ధురాలు కలుపు నివారణ మంది తాగిన ఘటన భద్రాద్రి జిల్లా పినపాక మండలంలోని తోగ్గూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఈ ఘటనకు సంబందించి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తోగ్గూడెం గ్రామానికి చెందిన బాడిశ ముత్తమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో కూల్‌డ్రింక్ సీసాలో నిల్వ ఉంచిన కలుపు నివారణ మందును పొరపాటున కూల్‌డ్రింక్ అనుకొని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు పినపాక ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

బైక్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

» శబ్దకాలుష్యం కలిగించే 25 సైలెన్సర్ల తొలిగింపు » ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు



సైలెన్సర్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలనకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ఖమ్మంనగరంలో మంగళవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే బుల్లెట్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొందరు యువత ద్విచక్రవాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్పుచేసి, అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతున్నారని, దీనివల్ల విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడడంతో పాటు, ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మరికొందరు వాహనాల హారన్‌లను సైతం అదే తరహాలో అమర్చుతున్నారని, అటువంటి వారి ఆట కట్టించేందుకు ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైందన్నారు. మంళవారం 25 మోడిఫైడ్ సైలెన్సర్ల వరకు తొలిగించి ఒక్కో వాహనదారుడికి రూ.1,000 జరిమానా విధించామని, ఇకపై ధ్వని కాలుష్యాన్ని కలిగింమచే వాహనాన్ని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈడ్రైవ్‌లు ఇంకా కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమించి తరుచు ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐ మోహన్‌బాబు, ఆర్: సాంబశివరావు, ఎస్ఐ రవి, సాగర్, వెంకన్న, రాము పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్సర్ల వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

మధిరటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ ఆగడాలు భరించలేక మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం మధిర మండలంలోని రాయపట్నం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గుగ్గిళ్లపు వెంకటేశ్వర్లుకు హౌసింగ్‌లోన్ ఇప్పిస్తామని మధిరకు చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు మాయమాటలు చెప్పి రూ.5లక్షల రుణం అంటగట్టారు. ఆయనకు తిరిగి కట్టే స్తోమత లేకపోయినా, ఆరోగ్యం కూడా బాగోలేదని తెలిపినా లోన్‌కు ఇన్సూరెన్స్ ఉందని ఒకవేళ ఏదైనా అయి చనిపోతే లోన్ కట్టే పనిలేదని చెప్పి లోన్ ఇచ్చారని అతడి కూతురు తెలిపారు. ఇటీవల ఆయన చనిపోతే లోన్ తన తండ్రి పేరున లేదని తన పేరునే ఉందని లోన్ కట్టాలని సంతకాలు ఉన్నాయని కూతురు రాజేశ్వరిని వేదిస్తుండటంతో మంగళవారం ఉదయం ఆమె తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇంటి పక్కన ఉన్నవారు ఇది గమనించి వెంటనే ఆమెను మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు రాజేశ్వరి నుంచి మధిర పోలీసులు వాంగ్మూలం తీసుకున్నారు.

సారా విక్రేతకు రూ.50వేల జరిమానా

పాల్వంచ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తరచూ నాటుసారా విక్రయిస్తూ పట్టుడుతున్న వ్యక్తికి పాల్వంచ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం జరిమానా విధించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ దుబ్బతండాకు చెందిన అజ్మీరా గణేష్ గతంలో పాల్వంచ మండలంలోని పలు గ్రామాలకు నాటుసారా సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. అతనిపై పాల్వంచ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసారు. మరలా గణేష్ సారా తయారు చేయడమే కాక పాల్వంచ మండలంలోనే విక్రయిస్తున్నాడనే సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అతడిని సారా రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. బైండోవర్‌ను ఉల్లఘించి సారా తయారు చేయడం, సరఫరా చేయడంతో అతనికి రూ. 50 వేల జరిమానా విధించారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పాల్వంచ ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

చుంచుపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిట్టి రామవరం తండాకు చెందిన బాణోత్ వాలా(62) అనే వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. చిట్టి రామవరంతండాలో బాణోత్ వాలా, అతని భార్య వాలికీలు ఇద్దరు నివాసం ఉంటున్నారు. ఇతని కుమారులు ఆ చుట్టు ప్రక్కలనే నివాసం ఉంటున్నారు. బాణోత్ వాలా కొంతకాలంగా మోకాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నాడు. ఆ బాధలు భరించలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు బాణోత్ బలరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

జూనియర్లపై సీనియర్ల పెత్తనం కూడా ర్యాగింగే

» యాంటీ ర్యాగింగ్ పై మెడికల్ కాలేజ్ విద్యార్థులకు అవగాహనలో సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'సీనియర్లు జూనియర్లపై పెత్తనం చేయడం కూడా ర్యాగింగ్ కిందకే వస్తుంది.. అలాంటి ఏ సంఘటనలు జరిగినా కేసులు తప్పవు... విద్యార్థులు మంచి సోదరభావ వాతావరణంతో ఒకరికొకరు మమేకం అవ్వాలి.. ర్యాగింగ్‌కు పాల్పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు' అని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉద్బోధించారు. మంగళవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ చట్టంపై విద్యార్థులకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి చంద్రశేఖర్‌తో కలసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విద్య వ్యవస్థలో ర్యాగింగ్ పై నిషేదం ఉందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేసినా సీనియర్లు జూనియర్లపై ఎలాంటి పెత్తనం చేయాలని చూసినా, ఇబ్బందులు పెట్టిన వెంటనే అధ్యాపకులకు తెలపాలని సూచించారు.చట్టాన్ని తెలుసుకొని మసులు కోవాలని తద్వారా భవిష్యత్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆనందంగా ఉండవచ్చన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదిగి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకోరావాలని కోరారు. తోటి విద్యార్థుల పట్ల సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని, అత్యుత్సాహానికిపోయి జైలుపాలై జీవితాలను అంధకారం చేసుకోవద్దని సూచించారు. సీనియర్స్, జూనియర్స్ పట్ల ర్యాగింగ్‌కు పాల్పడం చట్టాన్ని అతిక్రమించినట్లే అవుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కో సం ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి: విద్యార్థి సంఘాలు

ఖమ్మంటౌన్(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాలలో విద్యార్థికి జరిగిన సంఘటనలో కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు మంగళవారం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్‌దత్‌కు, ఏసీపీ రమణమూర్తికి వినతి పత్రాలు అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గసభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జీ.మస్తాన్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

» ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాల నిర్ణయం

కొత్తగూడెం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదలలో జాప్యం చేయడంతో 'మంగళవారం' నుంచి జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను బంద్ చేస్తున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం (టీపీడీఎంఏ) ప్రకటించింది. టీపీడీఎంఏ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరులోని కళాశాలలు నిరవధిక బంద్‌లో పాల్గొంటున్నాయి. 2016వ సంవత్సరంలో భద్రాచలంలో ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు అలస్యం కావడంతో పీఎస్ఆర్ఎం కాలేజ్ మూసివేశారు. గత నెలలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫీజు బకాయిలను త్వరలో విడుదల చేయుస్తానని హామీ ఇచ్చి నెలరోజులు గడిచినా విడుదల కాకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవదిక బంద్ పాటిస్తున్నట్టు యాజమాన్యాలు తెలిపాయి.

రేపు ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాల బాక్సింగ్ పోటీలు

చుంచుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అండర్-14, 17 పాఠశాల బాల, బాలికలకు బాక్సింగ్ పోటీలను గురువారం కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఇరు జిల్లాల డీఈవోలు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరచారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2008 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలను ఆస క్తి గల బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆటోను ఢీకొన్న మినీ వ్యాన్

ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలు

24గంటల వ్యవధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 9మంది కూలీలకు తీవ్రగాయాలు

తల్లాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం-బిల్లుపాడు ఆర్అండ్‌బీ రహదారిలో మంగళవారం రాత్రి ఆటోను మినీ వ్యాన్ ఢీకొంది. ఆటో అన్నారుగూడెం నుంచి రామచంద్రాపురానికి కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న టాటాఎస్ మినీ వ్యాన్ ఢీకొంది. ఆటోలో 15 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. మిగతా 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయా ణిస్తున్న రామచంద్రాపురం గ్రామానికి చెందిన మహిళా కూలీలు పులి లక్ష్మీ, పడాల రాధమ్మ, కందుల ఈశ్వరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో ఖమ్మం తరలించారు. 24గంటల వ్యవధిలో నర్సింహారావుపేట, అన్నారుగూడెంల వద్ద వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో 9మంది కూలీలు తీవ్రంగా గాయాలపాలైనట్లయింది.

కల్వర్టులోకి దూసుకెళ్లిన లారీ

కొణిజర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన కల్వర్టులోకి లారీ దూసుకెళ్లిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున కొణిజర్ల పొలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీస్‌ల కథనం ప్రకారం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నుంచి వైజాగ్‌కు మరమరాలలోడుతో వెళ్తున్న లారీ తెల్లవారుజామున పొలీస్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ లైటింగ్‌తో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లింది. కల్వర్టుకు అనుకొని చెట్టుఉండటంతో లారీ పల్టీ కొట్టకుండా ఆగింది. దాంతో ప్రమాదం తప్పింది. లారీలో డ్రైవర్, క్లీనర్ కాకుండ మరో ఇద్దరు ఉన్నారు. ఎవరికి గాయాలు కాలేదు. పోలీస్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సీనియర్ న్యాయవాది కృష్ణమూర్తి కన్నుమూత



కృష్ణమూర్తి (ఫైల్)

ఖమ్మం లీగల్/ఖమ్మం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది మర్రి కృష్ణమూర్తి(90) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన 1934 జూన్ 30న ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామంలో జన్మించారు ఉస్మానియ యూనివర్సిటీ నుంచి బీఏ ఎల్ఎల్‌బీ లో పట్టాపొందారు. ప్రముఖ న్యాయవాది కె.వి.సుబ్బారావు దగ్గర జూనియర్‌గా పనిచేశారు. 1962లో న్యాయవాది, వృతిని ప్రారంభించారు. 1971 నుంచి 1992 వరకు పీపీగా పనిచేశారు. వామపక్ష భావాలున్న కృష్ణమూర్తి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. భూమికోసం, భుక్తికోసం వెట్టి చాకిరీ విముక్తికోసం నిజాం నిరంకుశ పోలీస్‌కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తుపాకీ చేతపట్టి గంగవరపు శ్రీనివాసరావు, మచ్చ వీరయ్య దళంలో, తమ్మినేని సుబ్బయ్యతో కలిసి పనిచేశాడు. మంగళవారం ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ కృష్ణమూర్తి క్రిమినల్ న్యాయశాస్త్రంలో బాగా అనుభవం ఉందని, ఆయన సేవలను కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, పలువురు న్యాయవాద లీగల్ సంఘాలు, విధులను బహిష్కరించి సంతాపాన్ని తెలియజేశారు.

హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం

మంత్రి తుమ్మలను కలిసిన సంస్థ ప్రతినిధులు ● ఖమ్మంలో కిచెన్ షెడ్డు ఏర్పాటుకు కృషి: మంత్రి



హైదరాబాదులో మంత్రి తుమ్మలను కలిసిన హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు

ఖమ్మం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ పరిదిలో విద్యార్థులకు హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో అల్పాహారం అందించేందుకు అవసరమైన కిచెన్ షెడ్డు ఏర్పాటుకు కృషిచేస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు కౌటిల్యాదాస్, రవి సులోచనదాస్ తదితరులు మంగళవారం హైదరాబాదులో మంత్రి తుమ్మలను కలిశారు. ఖమ్మంలో తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి సూచించారు. ఇందుకు మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అదించేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు అవసరమైన కిచెన్‌షెడ్డును ఏర్పాటుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో మంత్రి తుమ్మల ఫోన్‌లో మాట్లాడి సూచించారు. విద్యార్థులకు హరేకృష్ణ సంస్థ తరుపున అల్పాహారం అందించేందుకు అవకాశం కలిపించిన మంత్రికి సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిలకు ఈ అల్పాహారం అందించడం జరుగుతుందని మంత్రి తుమ్మలకు సంస్థ ప్రతినిధులు వివరించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థి



నరేష్

ఏన్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో ఇటీవల జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏన్కూరు గురుకుల పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థి బి.నరేష్ అత్యంత ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబరు 3న జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. నరేష్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాస రెడ్డి, ఏటీపీ సునీల్, వేమరాజు, పీఈటీ వీరయ్య, డిప్యూటీ వార్డెన్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, లక్ష్మి, శ్రీనివాస్, రవికుమార్, విజయ్‌కుమారి, రజని, జమునరాణి, కుటుంబరావు, మోహన్ తదితరులు అభినందించారు.

భద్రాద్రి జిల్లా వాసికి ఆసియా హాకీ ఫెడరేషన్ గుర్తింపు

ఈ ఘనత సాధించిన మొట్టమొదటి గిరిజన యువకుడు నిఖిల్



అంతర్జాతీయ టెక్నికల్ ఆఫీసర్ ఎలిజబెత్‌తో జిల్లా వాసి నిఖిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసియా హాకీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నీకేట్ అఫీసియల్ లెవల్ కోర్సును భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన ఆపాక నిఖిల్ విజయవంతంగా పూర్తి చేశాడు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎంపికలతో పాల్గొని అద్భుతమైన మెళకువలను ప్రదర్శించి గతంలో సైతం అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన లెవల్ కోచ్ కోర్సును సైతం పూర్తి చేసిన వ్యక్తిగా గుర్తింపును పొందాడు. ఈ రెండు కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన మొట్టమొదటి గిరిజన యువకుడిగా ఘనత సాధించాడు.

స్థానిక కొత్తగూడెం హాకీ క్లబ్ సభ్యుడిగా తన హాకీ క్రీడ ప్రస్థానాన్ని ప్రారంభించిన నిఖిల్ 2021 సంవత్సరం హాకీ క్రీడల్లో ఎన్ఐఎస్ డిప్లొమా కోర్సును పూర్తి చేశాడు. పలు రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు నాయకత్వం వహించాడు. ఇటీవల ఆసి యా హాకీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు రాజ్‌గిరి, బీహార్ రాష్ట్రంలో నిర్వహించిన అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ - ఆసియా హాకీ ఫెడరేషన్ వారు చేపట్టిన టెక్నికల్ అఫీషియల్ లెవల్ కోర్సును పూర్తి చేశాడు. నిఖిల్ ప్రస్తుతం బిల్డింగ్ బ్లాక్స్ స్కూల్ నందు వ్యాయామ ఉపాధ్యాయునిగా తన విధులను నిర్వహిస్తు న్నాడు. ఇంత గొప్ప ఘనతను తమ క్రీడాకారు డు సాధించడం పట్ల భద్రాద్రి హాకీ అసోసియేషన్ ఛైర్మన్ పల్లపోతు శ్రీనివాస్, అధ్యక్షుడు ఇమాది ఉదయ్ కుమార్, కార్యదర్శి బట్టు ప్రేమ్‌కుమార్, కోచ్ షేక్ ఇమామ్, లగడపాటి రమేష్, సలీం ఖాన్, రాజ్‌కుమార్, కృష్ణవేణి, మంజుల, కవిత, నాగరాజు, సలీం తదితరులు అభినందించారు.

మావోయిస్టు దళసభ్యుడి లొంగుబాటు

వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



భద్రాద్రి ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దళసభ్యుడు మడవి అయిత

కొత్తగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141బెటాలియన్ పోలీసులు సంయుక్తంగా కృషి చేయడంతో ఛత్తీస్‌గఢ్ రాష్టానికి చెందిన మావోయిస్టు పార్టీ బెటాలియన్ దళసభ్యుడు మడివి అయిత, అలియాస్ మంగు జిల్లా పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట మంగళవారం లొంగిపోయినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న జి లోరుగడ్డ గ్రామానికి చెందిన మడివి అయిత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టు అధినేత హిడ్మా నాయకత్వంలో 1వ బెటాలియన్‌లో దళసభ్యుడిగా పని చేశాడు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ బెటాలియన్ నాయకుల ఆదేశాల మేరకు ఇతర దళసభ్యులతో కలిసి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు విధ్వంసకర ఘటనలో పాల్గొన్నట్లు తెలిపారు. ఇటీవల బీజాపూర్ జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేస్తుండటంతో మావోయిస్టు పార్టీని వీడి పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా అనేకమంది మావోయిస్టు పార్టీ నాయకులు, దళసభ్యులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయి స్వేచ్ఛగా జీవిస్తుండటం పట్ల మడవి అయిత సంతృప్తి చెంది జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. ఇతడిపై లక్ష రూపాయల రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు. ఇప్పటికైనా మావోయిస్టు పార్టీకి చెందిన నాయకులు, దళసభ్యులు ఆయుధాలు వీడి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల హక్కుల కోసం పోరాడాలని ఎస్పీ సూచించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే వారు తమ బంధుమిత్రుల ద్వారా కానీ పోలీసు అధికారుల ద్వారా కానీ స్వయంగా గానీ జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోవచ్చని వివరించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించి వారికి పునరావాసాన్ని కల్పిస్తామని ఎస్పీ తెలిపారు.

దారులన్నీ వెంకమ్మ చెరువు వైపే..

భక్తాంజనేయస్వామి ఆలయంలో వైభవంగా కార్తీక వనసమారాధన

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా, తాటి

భారీగా తరలివచ్చిన భక్తజనం.. స్తంభించిన ట్రాఫిక్



భక్తాంజనేయుడికి పూజలు చేస్తున్న భక్తులు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పచ్చని పొలాల మధ్య ఎక్కడ చూసినా జనసందోహమే. దారులన్నీ భక్తజనంతో కళకళలాడాయి. ఎటుచూసినా వెంకమ్మ చెరువు వైపు వెళ్లే వారే. భక్తులతో అశ్వారావుపేట మండలంలోని వెంకమ్మ చెరువు ఆలయ ప్రాంతం కళకళలాడింది. చెరువుపై ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అశ్వారావుపేట, దమ్మపేట, జీలుగుమిల్లి మండలాల నుంచి ఐదు వేలమందికిపైగానే భక్తులు తరలివచ్చారు. ఉదయం స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనల అనంతరం ఆంజనేయుడిని అలంకరించారు. ఉదయం నుంచి హనుమాన్ చాలీసాను భక్తిభావంతో పఠించారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11గంటల నుంచి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానంలో దాదాపు ఐదు వేల మంది వరకు భక్తులు పాల్గొన్నారు. భక్తులు ఒక్కసారిగా ఆలయానికి తరలిరావటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రించి ఇబ్బందులు లేకుండా చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆలయ కమిటీ అధ్యక్షులు దామెర కుమార మహిపాల్, ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు, నిర్వాహకులు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వ్యాపార లైసెన్సుల గడువును పెంచాలని వినతి

ఖమ్మం మార్కెట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఎగుమతి, దిగుమతి వ్యాపార లైసెన్సులను గతంలో మాదిరిగా 5సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేయాలని కోరుతూ సీపీఎంకి చెందిన పలువురు వ్యాపారులు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. అంతే కాకుండా మార్కెట్లో స్వీపర్లు, హమాలీలకు డ్రెస్‌కోడ్‌తో పాటు ప్రత్యేక భోజనశాల, రైతులకు ఐదు రూపాయల భోజన పథకం, సీసీఐ కొనుగోళ్లను కమిషన్ వ్యాపారులద్వారా కొనుగోలు చేయాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో వ్యాపారులు బండారు వీరబాబు, బజ్జూరి రమణారెడ్డి, సోమారపు సుధీర్‌కుమార్, బండ్లముడి వెంకటేశ్వరరావు, పగడాల మోహన్‌రావు, ఉట్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

24న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాఅథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల24న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సబ్‌జూనియర్స్ విభాగంలో అండర్- 08, 10, 12 బాలురు, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

రామకృష్ణకు డాక్టరేట్



ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం క్రిష్టయ్య బంజరుకు చెందిన కావటి రామకృష్ణకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నొలాజికల్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ నుంచి ఫార్మసీ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కెవి.రమణమూర్తి పర్యవేక్షణలో డవలప్‌మెంట్ అండ్ ఇన్ విట్రో అండ్ ఇన్‌వైవో స్టడీస్ ఆఫ్ నానోపార్టికల్స్ కంటేనింగ్ మిథోట్రెక్సేట్ గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పాఠశాల, కళాశాల విద్యార్థులకు ముగ్గుల, చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రయానికి ముఖ్య అతిధులుగా మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ పాతీమా జోర్, జిల్లా పంచాయితీ అధికారి ఆశాలత హాజరయ్యారు.

'సంఘం శరణం గచ్ఛామీ' నాటక ప్రదర్శన నేడు

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు సంఘం శరణం గచ్ఛామీ నాటకం ప్రదర్శించబడుతుందని నాటక రచయిత కె.దేవేంద్ర ఒక ప్రకటనలోతెలిపారు. అంబేద్కర్ జీవితం, ఆశయాలు, పోరాట విశేషాలను తెలియజేసే విధంగా ఈనాటికను అభ్యదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ సంస్థ నిర్మించిందన్నారు.

ప్రభుత్వ దమనకాండను వెంటనే నిలిపి వేయాలి

ఖమ్మంటౌన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): లగిచర్ల గిరిజనులపై ప్రభుత్వ దమనకాండను వెంటనే నిలిపి వేయాలని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో టీజీఎస్ త్రీటౌన్ అధ్యక్షుడు డోంగ్రోత్ శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా లగిచర్లలో ఫార్మా కంపెనీ పేరుతో గిరిజన రైతుల భూములను బలవంతంగా సేకరించటం దుర్మార్గమైన చర్య అన్నారు. గిరిజనలను మోసం చేస్తూ భూములు ఇవ్వకుంటే అక్రమ కేసులు బనాయించి వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సర్వేకోసం వెళ్లిన కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై దాడులు చేసిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, దాడికి సంబంధంలేని గిరిజనులపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గిరిజనసంఘం త్రీటౌన్ కార్యదర్శి డోన్‌వాన్ భిక్షం, నాయకులు లకావత్ బాలు నాయక్, అంగోత్ లచ్చునాయక్, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌కు ఫిర్యాదుల వెల్లువ

» సమస్యలు పరిష్కరించాలని కోరిన నాయకులు
» ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్న కమిషన్ చైర్మన్



సమస్యలు వివరిస్తున్న బీసీ నాయకుడు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నూతన కలక్టరేట్ కార్యాలయంలో బీసీకమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ విచారణకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. చైర్మన్ గోపిషెట్టి నిరంజన్, కమిషన్ సభ్యులు, రాపాల జయప్రకాష్, బాల లక్ష్మీ రంగు, తిరుమలగిరి సురేందర్, ఖమ్మం,భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు ముజామ్మిల్ ఖాన్, జితేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి బీసీ, మైనారిటీ, కుల, విద్యార్థుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. పలు సమస్యలను చైర్మెన్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బీసీ కులాల్లో పెద్ద కులాలే ఫలాలు పొందుతున్నాయని, కింది కులాలకు ఫలాలు అందడం లేదన్నారు చిన్న కులాల వాళ్లకు చట్టసభలకు వెళ్లడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మున్నూరు కాపులకు కులధ్రువీకరణ పత్రాలు అందటంలేదన్నారు. చాకలి కులస్తులు ఎస్సీలో చేర్చాలని కోరారు. మెదరి కులస్తులకు వెదురును అందుబాటులో తేవాలని కోరారు. చెట్టుబల్జీలను బీసీలో కలపాలని, ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లో చేర్చాలని కోరారు. బీసీ అట్రాసిటీ కేసు తేవాలని కోరారు. ఖమ్మంలో 4ఏళ్ల క్రితం గ్రామ బహిష్కరణ చేపట్టారని ఫిర్యాదు చేశారు. ఈఘటనపై సీపీ,కలెక్టర్లు ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని చైర్మన్ ఆదేశించారు.

సర్టిఫికెట్లు ఇవ్వటం లేదు

విద్యార్థులకు ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ పూర్తైన వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఫీజు రియింబర్స్‌మెంట్ రావటంలేదని, సర్టిఫికెట్లు కావాలంటే ఫీజు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారు. గిరిజనేతరులు కూడా తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని,రాష్ట్ర పరిధిలో పరీక్ష నిర్వహించాలని విన్నవించారు.

డబ్బు సంపాదనే ధ్యేంగా కళాశాలు

ఖమ్మంలో ప్రైవేటు కళాశాలలో రౌడీయిజం జరుగుతుందని ఒకరు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర వ్యాపితంగా అదే పరిస్థితి ఉందిని డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రైవేటు కళాశాలలు పని చేస్తున్నాయనీ నమ్ముతున్నామని ఏకీభవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 930 ఉర్దూ మీడియం టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని కోరారు. మేము రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ తెలిపారు.బీసీ కులసంఘాలతో అభిప్రాయ సేకరణ చేశాం. రెండు జిల్లాల నుంచి 80అర్జీలు వచ్చాయి. గంగపుత్రుల సంఘం నుంచి మత్స్యకారులకు రూ.5 వేలపింఛన్, ప్రమాదం జరిగితే రూ.10లక్షలు అందించాలని కోరారు. విద్యార్థుల నుంచి కూడా అర్జీలు తీసుకున్నామని చెప్పారు. ఏజెన్సీలో గిరిజనేతరులు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయని సంఘం సభ్యులు చెప్పారు. మీకు రావాల్సిన పథకాలు ఏ స్థాయిలో రావాలో తెలుసుకోవడం కోసం ఈ కులగణన చేస్తున్నామని చైర్మన్ అన్నారు. మీరు కూడా సంపూర్ణ వివరాలు ఇవ్వాలి. జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా, సామాజికంగా,ఆర్థికంగా మీకు రావాల్సిన పదవులు దక్కాలంటే ఈ సర్వే లో వివరాలు, సమాచారం అందించాలని చైర్మన్ గోపిషెట్టి నిరంజన్ చెప్పారు.ఈ విచారణ మంగళవారం రాత్రి వరకు నిర్వహించారు.

వరికొయ్యలు తగులబెట్టవద్దు

నేలకొండపల్లి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటను కోసిన తర్వాత వరి కొయ్యలను తగులబెట్ట వద్దని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. ప్రతీ మంగళవారం రైతు వేదికల్లో జరిగే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్సులో మంత్రి తుమ్మల రైతులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు సూచనలు చేసారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రాధ, ఏఈఓలు, డీఎంసీ చైర్మన్ పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్: వరి రైతులు ఎవరు కూడా వరి పంట కొయ్యలను కాల్చవద్దని ఏవో. ముద్వా నాగేష్ రైతులకు తెలిపారు. మంగళవారం ఏవో నాగేష్ రైతులకు పలు సూచనలు చేశారు. వరికొయ్యలు కాల్చకుండా భూమిని మరియు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం



కూసుమంచి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎంవీ.మధుసూధన్ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్యతో కలిసి ఖమ్మంజిల్లా కూసుమంచి మండలంలోని కిష్టాపురంలో ఆయిల్‌పామ్, బొప్పాయి పంటలను పరిశీలించారు. అతితక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందే పంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది ఆయిల్ పామ్ సాగులక్ష్యం పెంచేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. బొప్పాయి, ఆయిల్ పంటల యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. వాణిజ్యపంటలు సాగునుంచి ఉద్యాన పంటల సాగుచేసుకునేందుకు అలవాటు పడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సరిత, ఏవో వాణి, హెచ్‌వో అపర్ణ,ఏఈవోలు పాల్గొన్నారు.

మహిళా శక్తిని ప్రపంచానికి చాటిన ఇందిర

» 107వ జయంతిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల



నివాళులర్పిస్తున్న పువ్వాళ్ల

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మహిళల శక్తిని మనోధైర్యాన్ని ప్రపంచానికి చాటిన ఉక్కుమహిళ మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కొనియాడారు. ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పొట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుల నివాళి

ఖమ్మం ఖానాపురంహవేలి: ఖమ్మం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి బీసీకమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ రంగు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, బీసీసంక్షేమ అభివృద్ధి అధికారి జ్యోతి, బీసీస్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు. ముందుగా స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

తిరుమలాయపాలెం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని విక్రయించేందుకు వస్తున్న రైతులకు ఎటువంటి ఇబ్బందులకు గురిచేయవద్దని మండల వ్యవసాయాధికారి ఎస్.సీతారాంరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గోల్‌తండా సమీపంలోని భాగ్యలక్ష్మి కాటన్ మిల్లును ఆయన తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రాల్లో రైతులు పంటను అమ్ముకోవాలని తెలిపారు. పంట తెచ్చే వారికి ఎటువంటి అసౌకర్యాలు కలిగించకుండా చూడాలన్నారు. రైతులు పంటలు దళారీలుకు అమ్మి నష్టపోద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నవీనత, బాలకృష్ణ పాల్గొన్నారు

కొనసాగుతున్న అన్నదానం



బైపాస్ రోడ్‌లోని శ్రీధర్మశాస్త్ర పీఠంలో పూజా కార్యక్రమం

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఖమ్మంబైపాస్ రోడ్ లోగల శ్రీధర్మశాస్త్ర పీఠం ఆధ్వర్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంగళవారం అయ్యప్ప పూజలు, భజనలు నిర్వహించటంతోపాటు దీక్ష ధరించిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారులకు ఏటా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 21 రోజులుగా అన్నదాన కార్యక్రమం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అట్లూరిమధు, మణికంఠ, టి. పుల్లంరాజు, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం



దుర్గా మల్లికార్జునస్వామి దేవాలయంలో దీపోత్సవం

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని మమతారోడ్‌లో దుర్గా మల్లికార్జున స్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయంలో ఆకాశదీపం వెలిగించి, పూజలు నిర్వహించారు. అనంతరం ఓంకారం, త్రిశూలం రూపాల్లో ముగ్గులు వేసి, ఆ ముగ్గుల మధ్యలో దీపాలను వెలిగించారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో వీహెచ్ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, కోశాధికారి పసుమర్తి రవి,మహిళా అధ్యక్షురాలు కొనకంచి నాగమణి, అరుణ, సామినేని శ్రీనివాస్,రాణి, కూచిపుడి లక్ష్మీనారాయణ,భానుమతి, కృష్ణప్రియ, వీహెచ్‌పీ మహిళాకార్యకర్తలు పాల్గొన్నారు.

48గంటల్లో ధాన్యం డబ్బు జమచేయాలి

» సీపీఎం డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్

కూసుమంచి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 48గంటల్లో రైతుల ఎక్కౌంట్లలో డబ్బులు, రూ.500 బోనస్ జమ చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ ఇన్చార్జ్ బండి రమేష్ తెలిపారు. మంగళవారం కూసుమంచి సీపీఎం కార్యాలయంలో డివిజన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్స్ కొరత ఉందని తెలిపారు. దీనివలన కొనుగోలు నిలిచిపోయిందని, కొన్ని కేంద్రాల్లో ట్యాగ్ లు పంపిణీ చేయకపోవడంతో లారీల్లో రవాణాకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. తేమశాతం వచ్చిన తర్వాతకూడా వెంటనే కాంటాలు వేయడం లేదని, ట్రక్ షీట్లు రైతులకు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో మండల ఇన్చార్జ్ బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి తోటకూరి రాజు, రైతుసంఘ నాయకులు మల్లెల షన్మతి రావు, రమణారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

1న ఖమ్మంలో జన భోజనాలు

మాస్‌లైన్ జిల్లా కమిటీ

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వనభోజనాలు ఇప్పుడు రాజకీయ కులభోజనాలుగా మారాయని, అన్ని వర్గాల ప్రజల్ని కలుపుకొని 1న ఖమ్మంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలోని మామిడి తోటలో జనభోజనాలను ఏర్పాటు చేశామని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అవుల అశోక్, స్వర్ణ అధ్యయన వేదిక నిర్వాహకులు కాకిభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్నిబహుజన కులాలు ఆ దిశలో పయనించటం ఆందోళనలకు గురిచేస్తోందన్నారు.మేధావులు, విద్యావేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ శిరోమణి, కొల్లేటి నాగేశ్వరరావు, కే.శ్రీనివాస్, మంగతాయి, శోభ, లక్ష్మణ్, ఎన్వీ రాకేష్, తేజానాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

అధునాతనంగా 44వ డివిజన్ కూరగాయల మార్కెట్

» మేయర్ పునుకొల్లు నీరజ



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ పాలేపు

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయల్ని నేరుగా అమ్మకాలు జరిపేందుకు అధునాతనంగా రాష్ట్రంలోనే రైతు మోడల్ మార్కెట్‌గా 44వ డివిజన్‌లోని కూరగాయల మార్కెట్ రైతులకు ప్రయోజనకరంగా మారబోతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ, విజన్‌తో ఖమ్మం పాతబస్టాండ్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల సమీపంలో రైతులకు అందుబాటులో రైతు మోడల్ మార్కెట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. నూరుశాతం గ్రామీణ రైతులకే, మార్కెట్‌లో వ్యాపార అనుమతి ఉంటుందన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణతో కలిసి మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. రైతులకు అన్నివిధాలుగా సౌకర్యాలను కల్పించాలని, నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణ పనులను చేపట్టాలని డీఈ మాధవిని ఆదేశించారు.

మంత్రి తుమ్మల చొరవతో చెక్కులు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేస్తున్నారని ఆయన చొరవతోనే బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి డబ్బులు మంజూరు చేయించారని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలో మేయర్ 30,31,32,33, 34,35,36,46,48 డివిజన్లలో పర్యటించారు. లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఉపమేయర్ పాతిమాజోహరా, ఏబ్లాక్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్‌తిలక్,కల్వకుంట్ల గోపాల్, బాణాల లక్ష్మణ్, నున్నా మాధవరావు పాల్గొన్నారు.

పెద్దతండాలో సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతండా గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా అనేక సమస్యలు తిష్టవేసాయని ఆ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు నందిగామ కృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూపలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండ్ పద్మావతీ పెద్దతండాపంచాయతీ కార్యదర్శి సువర్ణ ఉమకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రసాదరావు, మాజీ ఉపసర్పంచ్ పుల్లయ్య, ఆంటోనీ, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, వెంకన్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలు సీజ్

కూసుమంచి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పురుగు మందులు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని జిల్లా వ్యవసాశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. మంగళవారం కూసుమంచి రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా కూసుమంచి, నేలపట్ల, జుజ్జులరావుపేట గ్రామాల్లో ఎరువుల దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జక్కేపల్లిలో పంట అవశేషాలను తగులబెడుతున్న రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను భూమిలో దున్నటం వలన భౌతిక స్థితి మెరుగు పడుతుందన్నారు. ఆయన వెంట ఏడీఏ సరిత, ఏవో వాణి పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలుశిక్ష

ఖమ్మంలీగల్,నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ఖమ్మంఅర్బన్ మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైన తురక నాగరాజుకు ఆరునెలలు జైలుశిక్షతోపాటు ఫిర్యాదికి రెండు లక్షల పదిహేనువేల రూపాయలు చెల్లించాలని ఖమ్మం మద్యపాన ఆబ్కారి ప్రత్యేక న్యాయస్థానం కోర్టు న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పుచెప్పారు. ఖమ్మం పట్టణం చెరువుబజారు ప్రాంతానికి చెందిన బుద్దా వేణు వద్ద నాగరాజు తన అవసరాల నిమిత్తం 2013లో 1,50,000 అప్పుగా తీసుకొని ప్రాంసరీనోటు రాసిఇచ్చాడు. రుణ చెల్లింపు నేపథ్యంలో చెక్కు జారీ చేశాడు. ఈ చెక్కు బ్యాంకు ఖాతాలో జమచేయగా సరిపడా నగదులేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా, విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

సీఎం మాటలను ఖండిస్తున్నాం

జిల్లా బీజేపి అధ్యక్షుడు గల్లా

ఖమ్మంబైపాస్‌రోడ్ నవంబరు19(ఆంధ్రజ్యోతి): వరంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా బీజేపి అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. ప్రాంతం వాళ్ల మోసం చేస్తే పాతిపెట్టాలన్న కాళోజి చెప్పినట్లు చేయాల్సి వస్తే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఏం చేయాలన్నారు. తెలంగాణ గడ్డ మీద సోనియాగాంధీ సంతకంతో ఇచ్చిన హామీల నిలుపుకోకపోతే సోనియకు తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే నైతికత లేదన్నారు.

రైతుల హామీల అమలులో విఫలం

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

కామేపల్లి, నవంబరు19: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు భూక్య శివ నాయక్ అన్నారు. తహసీల్దార్ సుధాకర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన 10నెలలు దాటిన ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం చెందిందని అన్నారు. రుణమాఫీ కాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. పత్తికి క్వింటాకు రూ.10వేలు, మొక్కజొన్నకు క్వింటాకు రూ.4వేలు, ధాన్యానికి క్వింటాకు రూ.4వేల చొప్పున మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో బానోత్ రాంజీ నాయక్, అజ్మీరా అశోక్ నాయక్ ఉన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం



కల్లూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈ ఏడాది ఇంటి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ 2024-2025 సంవత్సరానికి గాను పంచాయతీ పరిధిలో రూ.70 లక్షల వసూళ్లు కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 35 శాతం పన్నులు వసూళ్లు చేయడం జరిగిందన్నారు. వచ్చే డిసెంబరు 31 వ తేది నాటికి 100 శాతం వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఎంపీ రాంరెడ్డిని కలిసిన చెన్నారావు



ఎంపీకి వినతి ప్రతం ఇస్తున్న చెన్నారావు

కొణిజర్ల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దర్శీ చెన్నారావు ఎంపీ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలపై ఎంపీకి వివరించారు. చెక్ డ్యామ్‌లను, సీసీరోడ్లను కేంద్రం నుంచి ఎంపీ తరుపున మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లు అవసరం ఉన్నాయని, ప్రతి గ్రామంలో సీసీరోడ్డు అవసరం ఉందని, వాటి నిర్మాణం కోసం ఎంపీని కలిసినట్లు తెలిపారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

» తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్

ముదిగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దని తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్ సీసీఐ సిబ్బందికి సూచించారు. ముదిగొండ మండలం న్యాలక్ష్మీపురం సమీపంలో జిన్నింగ్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఆర్ఐ ప్రసన్నకుమార్, సీసీఐ, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

సత్తుపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ మెట్టాంజనేయ, అభయాంజనేయ స్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలలో మంగళవారం భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెట్టాంజనేయాలయంలో మద్దు వెంకటరమణ, లక్ష్మీకాంతం, వంశీ, కేసరి ప్రతాపరెడ్డి, అరుణ, పంతంగి మారేశ్వర రావు, రమాదేవి, నాగుల కృష్ణ, తేజ, సాయిపవన్, ముత్తా చక్రధర్, అభయాంజనేయాలయంలో నరసింగరావు, తిరుమలదేవి, పూజా లీలా, శభరినాథ్, స్వాతి, సా యినిర్మల, శేషగిరిరావు, పుష్పావతిలు అన్నప్రసాద వితరణ చేశారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాతల అగచాట్లు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

వైరా, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అన్నదాతలు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటా ఒక్కింటికి రూ.500 బోనస్ ఇస్తున్నామనే కారణంతో దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లకు వేరుగా కేంద్రాలు ఏర్పాటుచేసిన అనాలోచిత నిర్ణయాల పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకే కేంద్రంలో సన్న, దొడ్డురకాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయడం రైతులకు తలనొప్పిగా మారింది. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రంలో కూడా విధిగా సన్న, దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దాంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటుచేయడం రైతులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఖమ్మం జిల్లాలో దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీల ఆధ్వర్యంలో 86 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రూ.500బోనస్‌తో రైతులకు తీవ్ర ఇక్కట్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్ నుంచి సన్నరకం ధాన్యం క్వింటా ఒక్కింటికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఈరకం క్వింటా ఒక్కింటికి ధర రూ.2,320గా నిర్ణయించారు. దొడ్డురకం ధాన్యం క్వింటా ఒక్కింటికి రూ.2,300. కేవలం రూ.20 మాత్రమే ధరలో వ్యత్యాసం ఉంది. దొడ్డు రకానికి మాత్రం బోనస్ లేదు. సన్నరకం ధాన్యానికి సంబంధించి వైరా మండలంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వైరా సొసైటీ పరిధిలో ఐదు, పూసలపాడు సొసైటీలో రెండు, గరికపాడు సొసైటీలో మూడు కొనుగోలు కేంద్రాలను, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

దొడ్డు రకానికి కేవలం రెండు కేంద్రాలే..

మండలంలో మొత్తం 29 గ్రామాలుండగా, ఒక్క వైరా సొసైటీ పరిధిలో కేవలం రెండు చోట్ల మాత్రమే దొడ్డురకం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సన్నరకం ధాన్యాన్ని త మకు సమీపంలోనే ఉన్న కేంద్రాల్లో విక్రయించుకొని, దొడ్డురకం ధాన్యం విక్రయానికి దూరాభారమైన వేరే కొనుగోలు కేంద్రాలకు వెళ్లాల్సి రావడం రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. మండలంలోని గన్నవరం, తాటిపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాత్రమే దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. దాదాపు 14గ్రామాల రైతులు గన్నవరం, మరో 14 గ్రామాల రైతులు తాటిపూడిలోని కొనుగోలు కేంద్రాలకు తమ దొడ్డు రకం ధాన్యాన్ని తీసుకువెళ్లాలంటే తీవ్ర వ్యయప్రయాసలకు లోనుకావాల్సిన దుస్థితి నెలకొంది.

గతంలో మాదిరిగానే ప్రతి గ్రామంలో రెండు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సన్నరకానికి మాత్రమే రూ.500బోనస్ చెల్లించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్‌లో రైతు భరోసా రాక అలాగే రూ.రెండులక్షల రుణమాఫీ అందరికి అమలుకాక తీవ్ర అసంతృప్తిగా ఉన్న రైతుల్లో దొడ్డురకం ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల్లో మాత్రమే అష్టకష్టాలకోర్చి విక్రయించుకోవాలనే పరిపక్వత లేదని నిర్ణయం పట్ల రైతులు ఆగ్రహంగా ఉన్నారు.

» దొడ్డు రకం కొనుగోళ్లకు వేరే కేంద్రాల ఏర్పాటుపై రైతుల అసంతృప్తి
» రెండు రకాల ధాన్యాన్ని ఒకే చోట కొనుగోలు చేయాలని విజ్ఞప్తి

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

● శీలం నాగిరెడ్డి, రైతు, దాచాపురం



సన్నరకంతో పాటు దొడ్డు రకం ధాన్యాన్ని కూడా ఒకే కేంద్రంలో కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం పునరాలోచించాలి. వేర్వేరు కేంద్రాల్లో సన్న, దొడ్డురకాలను విక్రయించుకోవాలంటే అష్టకష్టాలకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం.

ఒకేచోట కొనుగోలు చేయాలి

● హన్మంతరావు, రైతు, గరికపాడు



గత ప్రభుత్వ హయాంలో మాదిరిగానే ఒకే కేంద్రంలో సన్న, దొడ్డురకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. వేర్వేరుగా ధాన్యం కొనుగోలు చేసి తమను ఇబ్బంది పెట్టొద్దు. తమ శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలి. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో దిగుబడులు తగ్గాయి. ఇప్పుడు సన్నరకం ఒక చోట, దొడ్డురకం ధాన్యం మరోచోట విక్రయించుకోవాలంటే అష్టకష్టాలకు గురవుతున్నాం. ఒకే కేంద్రంలో రెండు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

రైతులను మోసగిస్తే చర్యలు

» డీఎంవో అబ్దుల్ అలీ



మాట్లాడుతున్న డీఎంవో అలీం

ఏన్కూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో రైతులను మోసగించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అబ్దుల్‌అలీం హెచ్చరించారు. మంగళవారం ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశీలించారు. అనంతరం జూలూరుపాడు, ఏన్కూరు ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐ ముత్తిలింగం, ఎస్ఐ రఫీ, మార్కెట్ కార్యదర్శి బజార్, ఆర్ఐ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా పత్తి తదితర వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీమ్ అన్నారు. మంగళవారం తల్లాడలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం, మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు కాకతీయ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

కల్లూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని కాకతీయ షుగర్స్‌లో గురువారం క్రషింగ్ ప్రారంభించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగోళ్ల నాగేశ్వరరావు, ప్లాంట్ ఇంజనీర్ కె. రఘునాథబాబులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సీజన్‌లో 60 వేల టన్నుల చెరుకును గానుగగా ఆడించాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు మద్దతు ధరను కూడా రూ.3,400 గా నిర్ణయించటం జరిగిందని వారు వివరించారు. రైతులు తమ చెరుకును నరికేందుకు గాను కూలీల కొరతను అధిక మించేందుకు గాను ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా చెరుకు నరికే యంత్రాలను తెప్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు. బిల్లులను కూడా వారం లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమా చేయడం జరుగుతుందని తెలిపారు.

ఆంధ్రా నుంచి ధాన్యం రాకుండా చూడాలి

» ఏసీపీ రెహ్మాన్



రైతులతో మాట్లాడుతున్న వైరా ఏసీపీ రెహ్మాన్

మధిరటౌన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మధిర మండలంలో ఉన్న ధాన్యం సేకరణ కేంద్రాలకు ధాన్యం రాకుండా చూడాలని వైరా ఏసీపీ రెహ్మాన్ పోలీసులకు సూచించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన ఆంధ్రా సరిహద్దున ఉన్న ఖమ్మం పాడు గ్రామంలో ఉన్న ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. తెలంగాణ లో ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో పొరుగున ఉన్న ఆంధ్రా నుంచి ధాన్యం వచ్చే ప్రమాదం ఉందని, కావున జాగ్రత్తగా ఉండాలని సేకరణ కేంద్రాల వద్ద ఉన్న సిబ్బంది తో పాటు పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం దెందుకూరు, మాటూరులో ఉన్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సంధ్య, లక్ష్మీభార్గవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

» ఆర్డీవో నర్సింహారావు



వంగవీడులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహారావు

మధిరటౌన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సర్వే సిబ్బందికి అధికారులకు ఖమ్మం ఆర్డీవో నరసింహారావు సూచించారు. సిరిపురం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతర వంగవీడు గ్రామంలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీసీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ వేణు తదితరులున్నారు.

కల్లూరులో సర్వేపై సమీక్ష

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇంటింటా సర్వేపై తహసీల్దార్ సాంబశివుడు సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలో 62 శాతం లక్ష్యం సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో సురేష్‌కుమార్, డీటీ బాబ్జీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వరి కొయ్యలను కాల్చొద్దు'

వైరా, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వరి కోసిన తర్వాత రైతులు వరికొయ్యలను కాల్చొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు, రైతులతో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మండలంలోని ఖానాపురం రైతువేదికలో వైరా ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ వరి కోసిన తర్వాత రైతులు వాటిని భూమిలో కలియదున్ని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సైదులు, రాజేష్, వెంకటనర్సయ్య, వాసంతి, కీర్తి, రైతులు షేక్.లాల్‌అహ్మద్, తన్నీరు కిషోర్, సూరయ్య, మౌలాలి, సాంబయ్య పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో అయ్యవారిగూడెం, మామునూరు గ్రామాల్లో ఇందిరాక్రాంతి పథకం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ, మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ప్రభుత్వ మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, మైనారిటీసెల్ అధ్యక్షుడు షేక్ జానీబాషా, ఏపీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది, కాంగ్రెస్ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ధరణిలో భూమి మాయంపై రైతుల ఆందోళన

బోనకల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పాసుబుక్‌లో భూమి ఉన్నా ధరణిలో మాత్రం అట్టి భూమి కనిపించకపోవడం పై బాధిత రైతులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన ఎర్రగాని కొండలు, కృష్ణయ్య వెంకటేశ్వర్లులకు నారాయణపురం రెవెన్యూ పరిధిలో 1.20 ఎకరాల భూమికి గత 2019లో పాసుబుక్‌లు వచ్చాయి. కొంత కాలం వరకు రైతుబంధుతో పాటు రైతులకు వర్తించే అన్ని ప్రభుత్వ ప్రయోజనాలను పొందారు. ఆరు నెలల క్రితం రుణమాఫీకి సంబంధించి తమ భూములకు 1బీ తీసుకునేందుకు గానూ తాము మీసేవా కేంద్రానికి వెళ్తే భూమి ఉన్నట్లు చూపించడం లేదని వారు తెలిపారు. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటూ తహసీల్దార్‌ను కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నిర్వహించి భూముల వివరాలను ఆన్‌లైన్‌లో కనిపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలుమార్లు సర్వే నిర్వహించినా తమ భూ సమస్యకు పరిష్కారం దొరక డంలేదని వాపోయారు. ఇప్పటికి ఆన్‌లైన్‌లో తమ భూములు మాయం కావడం గురించి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నామని తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. మిస్సింగ్ సర్వే నంబర్ కింద టీఎం 33 కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించినా తమకు పని కాలేదన్నారు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు మరోసారి ఆశాభావంతో వెనుదిరిగారు.

ఆకతాయిని పట్టుకున్న గ్రామస్థులు

మధిరటౌన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మధిర మండల పరిధిలోని అల్లీనగరం గ్రామంలో ఓ ఆకతాయిని మంగళవారం రాత్రి గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ శాఖలో పని చేస్తున్న శివాజీ అనే ఉద్యోగి ఇంటిలోకి ప్రవేశించేందుకు యత్నించిన యువకుడిని యజమాని ప్రశ్నించడంతో, అతను పారిపోతూ రాళ్లు రువ్వడం సాగించాడు. దీంతో గ్రామస్థులు అతడిని దొంగగా భావించి వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు, పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

డిజిటల్ రంగంలో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు

» డీఈవో సోమశేఖరశర్మ, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు

చింతకాని, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డిజిటల్ రంగంలో రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నాయని డీఈవో సోమశేఖరశర్మ, తహసీల్దార్ కూరపాటి అనంతరాజులు అన్నారు. మంగళవారం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ (బీసీఎఫ్) ఆర్థిక సహకారంతో మండల పరిధిలోని రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, నేరడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లను వారు ప్రారంభించారు. బీసీఎఫ్ సంస్థ ఏడు కంప్యూటర్లను విరాళంగా అందజేసినట్లు ట్రస్టీ ఫణికుమార్ సింహాద్రి తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రాం ద్వారా డిజిటల్ పాఠాలను సంస్థ ఉద్యోగులచే బోధించడం జరుగుతుందన్నారు. వల్లెరో టెక్నాలజీస్ మరియు పిన్నెల్లి వెంకటేశ్వర్లు భాగస్వామ్యంతో సుమారు 400 మంది విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగుల్‌మీరా, ఎంఈవో శ్రీనివాసరావు, కంచం వంశీ, పెరుమాండ్ల అభిలాష్, కొరుకొండ కార్తీక్, జిడ్డు సూర్య, పిన్నెల్లి ఈశ్వర్, ఉత్తర శ్రవణ్, ఆమూల్యరెడ్డి, కన్నెబోయిన సీతరామయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్ సీజ్

» సాధారణ తనిఖీల్లో పట్టుబడినట్లు ఎంవీఐ వెల్లడి

సత్తుపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా వేరే పాఠశాల స్కూల్ బస్‌ను సత్తుపల్లిలో ఓ స్కూల్ పేరుతో తిప్పుతుండగా సాధారణ తనిఖీలలో పట్టుబడటంతో రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలోని శ్రీ చైతన్య పాఠశాల పేరుపై రిజిస్టర్ అయి ఉన్న ఓ బస్, సత్తుపల్లి విద్యాలయం పాఠశాల ఎటువంటి అనుమతులు లేకుండా విద్యార్థులను చేరవేస్తుంది. అయితే సత్తుపల్లి విద్యాలయం అనుమతులతో ఇక్కడ శ్రీ చైతన్య విద్యాలయం పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా కొన్నేళ్ల నుంచి స్థానికంగా విద్యార్థులను ఇంటికి, స్కూల్‌కు చేరవేసేందుకు వినియోగిస్తుంది. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య విద్యాలయం పేరుతో రిజిస్టర్ అయిన బస్ 60కిలోమీటర్ల పరిధిలో మాత్రమే నడపాల్సి ఉంది. దీంతో అక్కడి విద్యాసంస్థ పేరుతో ఇక్కడ కిలోమీటర్ల పరిధి దాటడంతో పర్మిట్ కండీషన్ అతిక్రమించినందుకు గానూ కేసు నమోదుచేసి బస్‌ను సీజ్ చేసినట్లు మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యాసంస్థలకు రిజిస్ట్రేషన్లు లేవా...?

జిల్లా కేంద్రంలోని పాఠశాల పేరుతో స్థానిక బస్ తిరుగుతుండటాన్ని సాధారణ తనిఖీలలో ఆర్‌టీవో అధికారులకు పట్టుబడటంతో స్కూల్ రిజిస్ట్రేషన్ల భాగోతం బయటకు వస్తున్నాయి. పట్టుబడిన బస్ సత్తుపల్లి కేంద్రంగా తిరుగుతుండగా ఆ విద్యాసంస్థ పేరుతో మరో పాఠశాల పేరుతో ఉండటం అటు తల్లీదండ్రులు, ఇటు స్థానికులను అయోమయానికి గురిచేసింది. ఒకరిని పోలిన మనుషులు ఉండొచ్చు.. నకిలీ వస్తువులు ఉండొచ్చు.. కానీ ఒకే విద్యాసంస్థ పేరుతో అక్కడా ఇక్కడా బస్ తిరుగుతున్నా ఇటు సంబంధిత అధికారులకు గానీ, అటు ఇతర యాజమాన్యాలకు గానీ ఎటువంటి అనుమానం రాలేదు. అదేవిధంగా ప్రస్తుతం విహారయాత్రల పేరుతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఫిట్‌నెస్‌లేని వారివారి స్కూల్ బస్సులు అనుమతులు లేకుండా జిల్లాలకు జిల్లాలు దాటిస్తున్నాయి యాజమాన్యాలు. వీటిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నారు.

ఇదే విషయమై ఎంఈవో నక్కా రాజేశ్వరరావును వివరణ కోరగా బస్ సీజ్ చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, జిల్లా అధికారులు ఆదేశించినట్లయితే స్కూల్ అనుమతులను పరిశీలిస్తానని తెలిపారు.

'ఇందిరాగాంధీ ఆశయాలు సాధించాలి'



కారేపల్లిలో ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో చిన్నారులు

తల్లాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేంసూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు. వేంసూరులోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, ఎండీ.పైజుద్దీన్, యర్రా సత్యం, బి.గాంధీబాబు, పుల్లారావు, అక్బర్, బికారీ పాల్గొన్నారు.



వేంసూరులో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కారేపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్ర ప్రకాష్,రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పగడాల మంజల ఆధ్వర్యంల ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కారేపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర సమరయోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి, దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

బోనకల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో మంగళవారం ప్రభుత్వ భూమిని పంచాయతీరాజ్ ఎస్ఈ రామనుజస్వామి, ఈఈ వెంకట్రామిరెడ్డి, డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ పున్నమ్ చందర్, ఆర్ఐ లక్ష్మణ్‌లు పరిశీలించారు. చింతకాని మండలం సీతంపేట నుంచి మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామం వరకు గల లింకు రోడ్డుకు బీటీ వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. చొప్పకట్లపాలెంలో సర్వే నంబర్ 222లో 13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. నూతనంగా వేయనున్న రోడ్డు ప్రభుత్వ భూమి మధ్య గుండా వెళ్తే పది ఎకరాలు మాత్రమే మిగులుతుందని తహసీల్దార్ డిప్యూటీ సీఎం భట్టి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో భట్టి అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లి ప్రభుత్వ భూమిని పరిశీలించాలని ఆదేశించారు. వారు గ్రామంలో ప్రభుత్వ భూమిని చూసి మధ్యలో గుండా రోడ్డు వెళ్తే భూమి వృథా అవుతుందని, పక్కగుండా వెళ్తే భూమి ఆదా అవుతుందన్న విషయాన్ని తాము డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

వంశరాజ్ సంఘ అధ్యక్షుడిగా వెంకట్రామయ్య



వెంకట్రామయ్యకు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర బాధ్యులు

సత్తుపల్లిరూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మం జిల్లా వంశరాజ్ సంఘ అధ్యక్షుడిగా సత్తుపల్లి మండలం సదాశివునిపేటకు చెందిన వినుకొండ వెంకట్రామయ్య నియమితులయ్యారు. మంగళవారం సత్తుపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆసంఘ రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో వంశరాజ్ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిల్లగుండ్ల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్నాటి వీరభద్రం, మహిళా అధ్యక్షురాలిగా బయ్యా నర్మదా, ఉపాధ్యక్షులుగా కత్తి నాగేశ్వరరావు, కర్నాటి వెంకట్రావు, సలహాదారులుగా కర్నాటి వెంకటేశ్వర్లు, జంగం సత్యం, కేవీ.కృష్ణారావు, వినుకొండ వెంకటేశ్వరరావు, సింగం వెంకన్న, యువత అధ్యక్షుడిగా కర్నాటి భద్రం, అధికార ప్రతినిధిగా వినుకొండ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బయ్యా రాము, లీగల్ అడ్వజయిర్‌గా కటికాల వెంకటేశ్వరరావులతోపాటు పలువురిని ఎన్నుకున్నారు.

పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్ వితరణ

వైరా, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు మదన్‌మోహన్ రేపాల రూ.పదివేల ఆర్థికసాయంతో స్పోర్ట్స్ కిట్‌ను మంగళవారం అందజేశారు. అలాగే 8,9,10తరగతుల విద్యార్థులకు ఎంపవర్మెంట్ తరగతులను మోహన్ బోధించారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, తోటకూర శ్రీకాంత్, ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, లగడపాటి ప్రభాకర్, జాలా పుల్లారావు, గంగవరపు కిషన్, పెనుగొండ ఉపేందర్, మరికంటి రాంగోపాల్, సూర్యదేవర శ్రీధర్, ఉయ్యూరు రామకృష్ణ పాల్గొన్నారు.

కల్లూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ కల్లూరు వారి సహకారంతో రూ.10 వేల విలువ గల క్రీడా పరికరాల సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. నల్గొండ లయన్స్ క్లబ్ బాధ్యులు రేపాల మదన్మోహన్ ఈ సామాగ్రిని వితరణ చేశారు. దీంతో కల్లూరు లైయన్స్ క్లబ్ బాధ్యులు చలవాది నగేష్, నరిసింహారావు, గంగుల నారాయణరావుల చేతుల మీదుగా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కోలాటం కర్రలు, చెస్ బోర్డ్స్ త్రోబాల్స్, వాలీబాల్స్ క్రికెట్ బ్యాట్స్, టెన్నిస్ బాల్ రింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ నాగలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు రహీం, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ బానోతు బీమా, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు